
JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | సోమవారం 23-03-2026
Medchal - Malkajgiri | Monday 23-03-2026
Follow: jayabherinews
సంపుటి : 02 | సంచిక : 295
పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 295 | Pages : 8 | ₹: 5


2 లో



- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సాయం "రైతు భరోసా" నిధులను విడుదల చేశారు. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో మీట నొక్కి నిధులను విడుదల చేశారు. రేపటి నుంచి రైతుల ఖాతాల్లో నిధులు జమవుతాయని, వచ్చే 45 రోజుల్లోగా 9 వేల కోట్ల రూపాయలు రైతులందరి ఖాతాల్లో నిధులు చేరిపోతాయని చెప్పారు.

- రాష్ట్ర రైతాంగానికి పెట్టుబడి సాయం "రైతు భరోసా" నిధులను విడుదల
- ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి రైతులకు అంకితమిచ్చారు
- వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం కోసం పంటల మార్పిడిపై రైతుల్లో చైతన్యం
- పశ్చిమాషియా యుద్ధం వల్ల గ్యాస్, యూరియాలకు కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- ప్రజా ప్రభుత్వం ఏ నియోజకవర్గాల పట్ల వివక్ష చూపదు

# నేడు రైతుల ఖాతాల్లో నిధుల జమ

*సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో కేవలం 17 నెలల కాలంలో పూర్తి చేసిన ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి రైతులకు అంకితమిచ్చారు. తర్వాత జిల్లాలో రూ. 775 కోట్ల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడంతో మరికొన్ని కొత్త పనులకు శంకుస్థాపన చేశారు.*

**జయభేరి, సిద్దిపేట జిల్లా :**

ప్రజాపాలన రైతు ఉత్సవాల్లో భాగంగా సాగిన ఈ కార్యక్రమాల్లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి. ఎంపీలు వేంనరేందర్ రెడ్డి, రఘునందన్ రావుతో పాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రైతును రాజును చేయడానికి వ్యవసాయ రంగంలో పంటల మార్పిడి విధానం రావాలని అభిప్రాయపడ్డారు. పశ్చిమాషియా యుద్ధం వల్ల గ్యాస్, యూరియాలకు కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. "వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం కోసం పంటల మార్పిడిపై రైతుల్లో చైతన్యం తీసుకురావలసిన అవసరం ఉంది. అందుకు సంబంధించి సరైన ప్రణాళికలు తయారు చేయాలి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు లాభసాటిగా ఎలా మార్చాలన్న విషయాలపై ప్రణాళికలు సిద్ధం కావాలి. పశ్చిమాసియా దేశాల్లో జరుగుతున్న యుద్ధం వల్ల రాబోయే రోజుల్లో యూరియా, గ్యాస్ సమస్యలు తలెత్తవచ్చు. ఎదుర్కొనడానికి సిద్ధపడాలి. తెలంగాణలోని రామగుండంలో ఉత్పత్తి చేస్తున్న యూరియా మన రాష్ట్రానికే ఇవ్వాలని కేంద్రాన్ని కోరాలి. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు నేతృత్వంలో రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకారంతో రాష్ట్రానికి అత్యధికంగా యూరియా కేటాయించేలా కోరాలి. ప్రస్తుత పరిస్థితుల్లో నానో యూరియా కూడా వినియోగం పెంచుకోవాలి. రాష్ట్రంలో ప్రాంతాల వారిగా వేర్వేరు పంటలు పండుతున్నాయి. సారవంతమైన భూములున్నాయి. వ్యవసాయ సాంకేతిక నైపుణ్యం అందుబాటులోకి తేవాలి. గిట్టుబాటు ధరలు కల్పించాలి. పంటలను అంతర్జాతీయ మార్కెట్ లో ఎగుమతులకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి. అందుకు బాధ్యత తీసుకుంటా. అద్భుతమైన తెలంగాణ నిర్మించుకోవడంలో, ప్రతి పంటా, ప్రతి గింజా బంగారు తెలంగాణ చేసుకోవడానికి ఉపయోగపడాలి. రాష్ట్రంలో ప్రాంతాల వారిగా రకరకాల పంటలు పండుతున్నాయి. పంట మార్పిడి విధానాలు రావాలి. రైతులను ప్రోత్సహించాలి. పండించిన పంటలకు మరింత లాభం రావాలంటే వ్యవసాయంలో మార్పు రావాలి. రైతుల్లో చైతన్యం తీసుకురావాలి. ఈ ఏడాది 71 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొన్నాం.

# ఇరాన్ ప్రతీకార దాడులు

- అమెరికాకు రూ.6,700 కోట్లు నష్టం

**జయభేరి, న్యూఢిల్లీ:**

మిడిల్ ఈస్ట్ లో ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరుకున్నాయి. అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ జరిపిన ప్రతీకార దాడులు అటు ప్రాణ నష్టంతో పాటు భారీ ఆర్థిక నష్టాన్ని కూడా మిగిల్చాయి. మనీకంట్రోల్ కథనం ప్రకారం.. ఈ దాడుల వల్ల జరిగిన ఆస్తి నష్టం విలువ దాదాపు 800 మిలియన్ డాలర్లకు (సుమారు రూ. 6,700 కోట్లు) చేరుకుంది. అమెరికాకు చెందిన అధునాతన యుద్ధ విమానాలు, రక్షణ వ్యవస్థలు, నివాస భవనాలు ఈ దాడిలో తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పరిణామం అగ్రరాజ్యం అమెరికాకు కోలుకోలేని దెబ్బగా మారింది.
ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలపై కూడా దీని ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. యుద్ధ భయంతో అంతర్జాతీయ మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు విఫలం కావడమే ఈ స్థాయి వినాశనానికి కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
భవిష్యత్తులో ఈ ఘర్షణలు ఇంకా ఏ మలుపు తిరుగుతాయోనని ప్రపంచ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ దాడిలో అమెరికాకు చెందిన క్షిపణి రక్షణ వ్యవస్థలు విఫలమవ్వడం రక్షణ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులు అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యాలను తాకాయి. దీనివల్ల రన్ వేలు, ఇంధన నిల్వ కేంద్రాలు పూర్తిగా కాలిపోయాయి. ఇరాన్ తన సైనిక సామర్థ్యాన్ని నిరూపించుకోవడమే లక్ష్యంగా ఈ భారీ ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. గతంలో తమపై జరిగిన దాడులకు ఇది సరైన సమాధానమని ఇరాన్ సైనిక కమాండర్లు ప్రకటించారు.


2 లో

# రికార్డుల రారాజు ప్రధాని నరేంద్ర మోదీ

- ఎవరికీ సాధ్యం కాని మరో అరుదైన రికార్డ్ నెలకొల్పిన భారత్ పీఎం

**జయభేరి, న్యూఢిల్లీ:**


ఎన్నో రికార్డులు, మరెన్నో రివార్డులు ఇవన్నీ ప్రధాని మోదీ సొంతం. ఆయన చిన్న ట్వీట్ చేస్తే కోట్లలలో వ్యూస్. ఆయన ఒక్క మాట చెబితే యావత్ దేశం దాన్ని ఆచరించాల్సిందే. అలాంటి మహానేత ప్రధాని మోదీ ఈ రోజు ఓ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఈ రికార్డుతో దేశ చరిత్రలో చిరస్థాయిలో నిలిచి పోయిన మనిషిలా నిలిచిపోయారు.
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం చారిత్రాత్మక మైలురాయిని చేరుకున్నారు. భారత దేశంలో అత్యంత కాలం పదవిలో కొనసాగిన ప్రభుత్వాధినేతగా నిలిచి సిక్కిం మాజీ ముఖ్యమంత్రి పవన్ కుమార్ చామ్లింగ్ నెలకొల్పిన రికార్డును అధిగమించారు. పవన్ కుమార్ చామ్లింగ్ 8,930 రోజుల పాటు ముఖ్యమంత్రిగా సేవలందించగా, నరేంద్ర మోదీ ఇప్పుడు ప్రభుత్వాధినేతగా మొత్తం 8,931 రోజులు పూర్తి చేశారు. ఇందులో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన చేసిన సేవల కాలంతో పాటు ప్రధాన మంత్రిగా ఉన్న కాలం కూడా చేరుస్తారు.
తన రాజకీయ ప్రస్థానంలో మోదీ అనేక ప్రత్యేక గుర్తింపులు పొందారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 2014లో ప్రధాన మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించే వరకు ఆ పదవిలో కొనసాగారు. గుజరాత్‌లో అత్యంత కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి కూడా ఆయనే కావడం విశేషం. అలాగే ముఖ్యమంత్రిగా ఎక్కువ అనుభవం కలిగి ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏకైక నాయకుడిగా కూడా నిలిచారు. భారత స్వాతంత్ర్యం తర్వాత జన్మించిన తొలి ప్రధాన మంత్రిగా కూడా ఆయన ప్రత్యేకత సాధించారు.

# అమరావతి నిర్మాణం హైదరాబాద్‌నే మించిపోతుంది

- ఐఎస్‌బీ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు
- డేటా సెంటర్లు, సరైన విధానాల రూపకల్పనతో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలబెడతాం

**జయభేరి, హైదరాబాద్ :**

అత్యంత అధునాతన టెక్నాలజీతో అమరావతిని స్మార్ట్ సిటీగా మారుస్తామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. హైదరాబాద్‌ను మించేలా అమరావతిని నిర్మిస్తామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో అమరావతిని పూర్తిగా పక్కన పడేశారని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వేదికగా జరిగిన సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, ఏఐ వినియోగం, డేటా భద్రత, భవిష్యత్ టెక్నాలజీలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, అభివృద్ధి మాత్రమే ఎన్నికల్లో విజయం సాధించడానికి సరిపోదని, అయితే సమాజంలో అసలైన మార్పుకు సాంకేతికతే ప్రధాన ఆధారమని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ముప్పై ఏళ్ల కిందటే ఐటీ రంగంపై దృష్టి పెట్టామని, ప్రస్తుతం ప్రపంచం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, స్పేస్ టెక్నాలజీ దిశగా వేగంగా ముందుకెళ్తోందని చెప్పారు. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌ల వినియోగం పెరుగుతుండగా, ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తున్నదని పేర్కొన్నారు. డేటా సెంటర్లు, సరైన విధానాల రూపకల్పనతో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలబెడతామని తెలిపారు. 1990 దాటాక మనవద్ద ఇంటర్నెట్ ప్రారంభమైందని చెప్పారు. ఆతర్వాత 1995 నుంచి నాలెడ్జ్ ఎకానమీ మొదలైందని గుర్తు చేశారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడంలో తమ కృషి ఎంతో ఉందని చంద్రబాబు గుర్తు చేశారు. ఐఎస్‌బీని హైదరాబాద్‌కు తీసుకురావడంలో





# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో భారీ మోసం

- నకిలీ తాళాలిచ్చి నమ్మబలికే ముఠా గుట్టురట్టు!
- విస్మయానికి గురిచేసే 'ఫోర్జరీ' మాయాజాలం
- 300 మంది బాధితులు..

**జయభేరి, హైదరాబాద్ :**

సొంత ఇంటి కల అనేది ప్రతి పేదవాడి జీవిత కాల వాంఛ. ఆ ఆశనే పెట్టుబడిగా మార్చుకున్న ఓ కిలాడీ ముఠా, వందలాది మందిని నిలువునా ముంచేసింది. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తన పలుకుబడితో ఇప్పిస్తానని నమ్మించి, నకిలీ పత్రాలు, నకిలీ తాళాలతో తమాషా చేస్తున్న దళారుల దందాను ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఆటోలో తిరుగుతూ.. కాలనీలే లక్ష్యంగా.. ఈ మోసాలకు సూత్రధారి ఒక మహిళ కావడం గమనార్హం. ఆమె మరో ముగ్గురితో కలిసి ఒక పక్కా ముఠాను ఏర్పాటు చేసింది. వీరు ప్రధానంగా నగరంలోని పేదలు నివసించే కాలనీలు, బస్తీలను ఎంచుకుంటారు. ఒక ఆటోలో ఆయా ప్రాంతాల్లో చక్కర్లు కొడుతూ,




# శ్రామిక మహిళ వసతి భూమిలో నిర్మాణం ప్రారంభం

- అక్రమార్కుల చెర నుండి హాస్టల్ భూమికి విముక్తి..?
- స.నెం 647లో శ్రామిక మహిళా హాస్టల్ నిర్మాణం పనులు ప్రారంభం.. హాస్టల్ నిర్మాణం పట్ల స్థానికుల హర్షం..
- వేగంగా నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి

## ఇరాన్ ప్రతీకార దాడులు

అమెరికా ప్రభుత్వం ఈ నష్టాన్ని అంచనా వేయడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. కేవలం భవనాలే కాకుండా రక్షణ రంగంలో వాడే అత్యాధునిక సాంకేతిక పరికరాలు కూడా ధ్వంసమయ్యాయి. వీటిని తిరిగి పునరుద్ధరించడానికి కొన్ని నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ లోపు ఆ ప్రాంతంలో అమెరికా సైనిక పట్టు బలహీనపడకుండా అదనపు బలగాలను పంపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. పొరుగు దేశాలైన ఇజ్రాయెల్, సౌదీ అరేబియా కూడా తమ సరిహద్దుల్లో రక్షణను కట్టుదిట్టం చేశాయి. గత కొన్నేళ్లుగా అమెరికా, ఇరాన్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. 2020లో ఇరాన్ టాప్ జనరల్ ఖాసీం సులేమానీని అమెరికా హతమార్చినప్పటి నుండి ఈ పగ మరింత పెరిగింది. ప్రస్తుత దాడులు ఆ పాత గొడవలకు కొనసాగింపుగానే కనిపిస్తున్నాయి. ఒకవేళ అమెరికా ఇప్పుడు తిరిగి ఎదురుదాడి చేస్తే అది పూర్తి స్థాయి యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉంది. ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ఇరు దేశాలను సంయమనం పాటించాలని కోరింది.

## రికార్డుల రారాజు ప్రధాని నరేంద్ర మోదీ

2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు తన పార్టీకి విజయాన్ని సాధించి జాతీయ రాజకీయాల్లో తన స్థాయిని మరింత బలపరిచారు. గత ఏడాది జులైలో ఆయన మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ రికార్డును అధిగమించి, వరుస పదవీకాలాల్లో రెండో అత్యంత కాలం సేవలందించిన ప్రధాన మంత్రిగా నిలిచారు. 2025 జులై 25 నాటికి ఆయన 4,078 రోజులు పదవిలో పూర్తి చేశారు. ఇందిరా గాంధీ 1966 జనవరి 24 నుండి 1977 మార్చి 24 వరకు నిరవధికంగా 4,077 రోజులు ప్రధాన మంత్రిగా పనిచేశారు. నిరవధికంగా అత్యంత కాలం పదవిలో ఉన్న రికార్డు భారత తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూకే చెందుతుంది. వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీలకు విజయాలు సాధించిన విషయంలో మోదీ, నెహ్రూకు సమానంగా నిలిచారు. రాష్ట్రం మరియు కేంద్రం స్థాయిల్లో ఎన్నికైన ప్రభుత్వాధినేతగా మోదీ ఇప్పటికే అత్యంత దీర్ఘకాలం పదవిలో ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందారు. గుజరాత్‌లోని వద్నగర్‌లో సాధారణ కుటుంబంలో జన్మించిన మోదీ.. చిన్నప్పుడే తన తండ్రికి రైల్వే స్టేషన్‌లో టీ అమ్మడంలో సహాయం చేశారు. అనంతరం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), తరువాత భారతీయ జనతా పార్టీ (బీజేపీ) లో క్రమంగా ఎదిగారు. ప్రజలతో సన్నిహిత అనుబంధం, ప్రభావవంతమైన ప్రసంగ శైలికి ప్రసిద్ధుడైన మోదీ.. దశాబ్దానికి పైగా గుజరాత్ ముఖ్యమంత్రిగా సేవలందించి, 2014లో బీజేపీకి చారిత్రాత్మక జాతీయ విజయాన్ని అందించారు. అప్పటి నుంచి ప్రపంచ వేదికపై భారత్‌ను ధైర్యవంతమైన, స్పష్టమైన స్వరంగా నిలబెడుతూ కీలక గ్లోబల్ నాయకుడిగా తన స్థానాన్ని మరింత బలపరిచారు.

## నేడు రైతుల ఖాతాల్లో నిధుల జమ

సన్నబియ్యం పంపిణీ చేయడంతో పాటు ప్రపంచంలోని చాలా దేశాలకు ఎగుమతి చేసినప్పటికీ ఇంకా మిగిలిపోతున్నాయి. చిన్న రాష్ట్రమైనప్పటికీ ఈ ఏడాది 2.58 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసి దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచాం. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించుకున్న నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్రంలో 3 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఆయిల్ పామ్ 10 లక్షల ఎకరాల్లో పండించినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఆయిల్ పామ్ లాంటి కర్మాగారాలు వచ్చి వ్యవసాయం లాభసాటిగా మారితే రైతుల పిల్లలు చదువుకోవడానికి, ఇళ్లు కట్టుకోవడానికో ఎవరినీ చేయి చాచాల్సిన అవసరం రాదు. నిజామాబాద్ జిల్లా అంకాపూర్ గ్రామాన్ని రాష్ట్రంలోని 12,728 గ్రామ పంచాయతీలు ఆదర్శంగా తీసుకోవాలి. లాభసాటి పంటలు పండించే విధంగా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నర్మెట్టలో నిర్మించినట్టుగానే కొడంగల్ నియోజకవర్గంలోనూ పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చొరవ తీసుకోవాలి. గత ప్రభుత్వ హయాం 114 నెలల కాలంలో రైతు సంక్షేమం కోసం సగటున ప్రతి నెల 2,533 కోట్లు ఖర్చు చేస్తే, ప్రజా ప్రభుత్వం గడిచిన 28 నెలల కాలంలో ప్రతి నెల 5,500 కోట్లు ఖర్చు చేసింది. రైతుల కోసం ఉచిత కరెంట్, గిట్టుబాటు ధరలు, సన్నవడ్లకు బోనస్, రుణమాఫీ, రైతు భరోసా, బీమా, అకాల వర్షాలొచ్చినప్పుడు పంట నష్టపరిహారం... మొత్తంగా రూ. 1.30 లక్షల కోట్లను ఖర్చు చేసి రైతు రాజ్యంగా కొనసాగిస్తున్నాం. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయ పార్టీల మధ్య సమన్వయం ఉండాలి. అభివృద్ధి కార్యక్రమాలను కలిసికట్టుగా సాధించుకుందాం. ప్రజా ప్రభుత్వం ఏ నియోజకవర్గాల పట్ల వివక్ష చూపదు" అని స్పష్టం చేశారు. నర్మెట్టలో జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా 1600 రైతు వేదికల ద్వారా రైతులు వీక్షించారు.

## అమరావతి నిర్మాణం హైదరాబాద్‌నే..


కీలక పాత్ర పోషించామని, శంషాబాద్ విమానాశ్రయం కోసం వేల ఎకరాల భూమిని సేకరించామని చెప్పారు. నల్సార్, ట్రిపుల్ ఐటీ వంటి ప్రముఖ విద్యాసంస్థలను కూడా తామే స్థాపించామని వివరించారు. కేవలం తొమ్మిది నెలల్లో కృష్ణా నది నీటిని హైదరాబాద్‌కు అందించి తాగునీటి సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు గ్లోబల్ గుర్తింపు తెచ్చేందుకు చేసిన ప్రయత్నాలను చంద్రబాబు గుర్తుచేశారు. బిల్ గేట్స్‌ను స్వయంగా కలసి భారతీయుల ప్రతిభను వివరించి, హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కార్యాలయం ఏర్పాటు చేయించామని చెప్పారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఆహ్వానం లేకుండానే హైదరాబాద్‌ను సందర్శించారని, ఆయన సూచనతో టోనీ బ్లెయిర్ కూడా నగరాన్ని సందర్శించారని తెలిపారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చేతుల మీదుగా హైటెక్ సిటీ ప్రారంభమైందని గుర్తు చేశారు. విద్యుత్ కొరత నుంచి మిగులు విద్యుత్ సాధించే స్థాయికి ఆంధ్రప్రదేశ్ చేరిందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రస్తుతం సోలార్, విండ్, గ్రీన్ ఎనర్జీ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, దక్షిణ భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ వినియోగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. 2014-19 మధ్య అనేక సంస్కరణలు చేపట్టామని, ఇప్పుడు అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమతూకంగా ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో మోసం

తమకు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సంబంధాలు ఉన్నాయని, సచివాలయంలో పనులు చేయించగలమని నమ్మిస్తారు. కేవలం ఇళ్లే కాకుండా, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, ఇతర సంక్షేమ పథకాలు కూడా ఇప్పిస్తామంటూ అమాయకులకు బురిడీ కొట్టిస్తారు. ఈ క్రమంలో ఒక్కొక్కరి నుంచి మొదట దరఖాస్తు ఖర్చుల పేరుతో రూ. 4,000 నుండి రూ. 5,000 వరకు వసూలు చేస్తారు.

ఈ ముఠా చేసే మోసం సామాన్యమైనది కాదు. లబ్ధిదారులకు నమ్మకం కలిగించడం కోసం వీరు నకిలీ అలాట్‌మెంట్ లెటర్లను (మంజూరు పత్రాలను) సృష్టిస్తారు. ఇందుకోసం ఆర్డీవో, జిల్లా కలెక్టర్ వంటి ఉన్నతాధికారుల సంతకాలను అచ్చుగుద్దినట్లు ఫోర్జరీ చేస్తారు. దర్యాప్తులో తేలిన ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. నిత్యం మద్యం మత్తులో ఉండే ఒక వ్యక్తికి రోజుకు రూ. 100 ఇచ్చి, అతనితో ఈ ఉన్నతాధికారుల సంతకాలను చేయించేవారు. ఈ నకిలీ పత్రాలను చూసి నిజమైనవే అని నమ్మిన లబ్ధిదారుల నుండి ఆ తర్వాత భారీగా నగదు వసూలు చేసేవారు. అక్కడ ఏదో ఒక ఇంటిని చూపిస్తూ.. "ఇదే మీ ఇల్లు" అని నమ్మబలుకుతారు. ఆ వెంటనే ఒక నకిలీ తాళం చెవిని, ఫోర్జరీ చేసిన పట్టా పత్రాన్ని బాధితులకు అందజేస్తారు. ఈ 'తాళం ఇచ్చే' ప్రక్రియ పూర్తికాగానే ఒక్కొక్కరి నుండి రూ. 15,000 నుండి రూ. 25,000 వరకు గుంజుతారు. ఆ తాళంతో బాధితులు ఇంటి తలుపు తీసేందుకు ప్రయత్నించి, అది పని చేయలేదని గుర్తించేలోపే ఈ ముఠా తన మకాం మార్చేస్తుంది. ఇప్పటివరకు సుమారు 300 మందికి పైగా ఈమె చేతిలో మోసపోయినట్లు పోలీసులు గుర్తించారు. అంబర్‌పేట్, మలక్‌పేట్, ముషీరాబాద్, బోరబండ, కూకట్‌పల్లి వంటి ప్రాంతాల్లో ఈ ముఠా నెట్‌వర్క్ విస్తరించింది. ప్రస్తుతం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ప్రభుత్వం ఇళ్లను కేవలం పారదర్శకమైన లాటరీ పద్ధతిలో మాత్రమే కేటాయిస్తుందని, మధ్యవర్తులను నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని ప్రజలను హెచ్చరించారు. ఎవరైనా ఇళ్ల పేరుతో డబ్బులు అడిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# యూపీ ఐపీఎస్ అధికారిణిపై బాడీ షేమింగ్ వ్యాఖ్యలు, ఇలాంటి కేసుల్లో చట్టం ఏం చెబుతోంది?



మీర్జాపూర్ జిల్లా ఎస్పీ అపర్ణ రజత్ కౌశిక్, సోషల్ మీడియాలో అభ్యంతరకర కామెంట్లుఫొటో సోర్స్, ఫొటో క్యాప్షన్,మీర్జాపూర్ ఎస్పీ అపర్ణ రజత్ కౌశిక్ కథనం..

గత కొన్నిరోజులుగా సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవుతోంది, ఇందులో ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ జిల్లా ఎస్పీ అపర్ణ రజత్ కౌశిక్ ఒక ప్రెస్ బ్రీఫింగ్ చేస్తున్నారు. ఆ వీడియోలో ఎస్పీ ఏ విషయం మాట్లాడుతున్నారనే విషయంపై చర్చ జరగడానికి బదులుగా, ఆమె ఎలా కనిపిస్తున్నారనే దానిపై ప్రజలు కామెంట్ చేస్తున్నారు.

వాస్తవానికి, ఒక అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని అందించడానికి ఎస్పీ అపర్ణ కౌశిక్ ప్రెస్ బ్రీఫింగ్ వీడియోను మీర్జాపూర్ పోలీసులు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇటీవల అప్‌లోడ్ చేసిన ఈ వీడియోకు లక్షలాది వ్యూస్, వేలాది కామెంట్లు వచ్చాయి. కానీ, మెజారిటీ సోషల్ మీడియా యూజర్లు పోలీసుల పనితీరుపై వ్యాఖ్యానించడానికి బదులుగా, ఎస్పీ కదలికలు, శారీరక ఆకృతిని ఉద్దేశించి అసభ్యకరమైన కామెంట్లు చేశారు. బాడీ షేమింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత, పోలీసులు ఈ పోస్ట్‌లో కామెంట్ సెక్షన్‌ను మూసివేశారు. ఈ విషయంపై అపర్ణ రజత్ కౌశిక్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించింది. కానీ, ఆమెను సంప్రదించడం సాధ్యం కాలేదు. ఆమె డ్యూటీలో బిజీగా ఉన్నారని పోలీసులు చెప్పారు. ఈ ఘటన అనంతరం, మరోసారి బాడీ షేమింగ్‌పై చర్చ మొదలైంది.

**'సమాజం ఎంతగా దిగజారిపోయిందో'**

ఎస్పీ అపర్ణపై సోషల్ మీడియా కామెంట్ల పట్ల అమేథీకి చెందిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ దీపక్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటిది మరెవరికీ జరగకూడదన్నారు.

"అపర్ణ గారిని అమేథీలో ఉన్నప్పుడు చాలాసార్లు కలిశాం. ఆమె చాలా మర్యాదపూర్వకమైన మహిళ. ఒక అధికారి గురించి వ్యాఖ్యలు వారి పని తీరుపై ఉండాలి తప్ప, ఇతర కారణాల వల్ల కాదు. ఇప్పుడు చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు" అన్నారు దీపక్ సింగ్.

"ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, వేలాది మంది ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న మహిళ పట్ల ఇంతటి తప్పుడు భాషను ఉపయోగిస్తూ గౌరవానికి భంగం కలిగించడం చూస్తుంటే, మన సమాజం గత కొంతకాలంగా ఎంతగా దిగజారిపోయిందో, ఎంత క్రూరంగా మారిందో తెలుస్తోంది" అని లక్నో విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, సామాజిక కార్యకర్త రూప్ రేఖ వర్మ అన్నారు.

"ఒక వ్యక్తిని ఏ విధంగా చూస్తారనేది అవతలి మనిషి దృక్పథంపై ఆధారపడి ఉంటుంది" అని రేఖ వర్మ చెప్పారు. ఈ ఉదంతం కేవలం ఐపీఎస్ అధికారిణి అపర్ణ రజత్ కౌశిక్‌కు మాత్రమే పరిమితం కాదు. అలాగే, కేవలం మహిళలే దీనికి లక్ష్యంగా మారుతున్నారని కాదు. సోషల్ మీడియాలో లేదా సామాన్య జీవితంలో మనందరం మన శారీరక ఆకృతి, రంగు లేదా రూపురేఖల గురించి ఏదో ఒక సమయంలో వినే ఉంటాం.

**సోషల్ మీడియాకే పరిమితం కాలేదు**

ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు చెందిన మెంటల్ హెల్త్ అండ్ బిహేవియరల్ సైన్సెస్ విభాగం 2019లో ఓ సర్వే నిర్వహించింది. బాడీ షేమింగ్ కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాలేదని, పాఠశాలలు, పని ప్రదేశాలలో కూడా ఉందని ఆ సర్వే తెలిపింది.

సర్వే ప్రకారం, ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, తరచుగా ఈ ప్రతికూల వ్యాఖ్యలు అపరిచితుల నుంచి కాకుండా, స్నేహితులు, తెలిసిన వారి నుంచి కూడా వస్తున్నాయి. సర్వే గణాంకాల ప్రకారం 47.5 శాతం మంది మహిళలు పాఠశాల లేదా పని ప్రదేశంలో బాడీ షేమింగ్‌ను ఎదుర్కొన్నట్లు తెలిపారు. సురక్షితంగా, సహకారంతో ఉండాల్సిన ప్రదేశాలు, కొన్నిసార్లు అసౌకర్యంగా, మానసిక సవాళ్లతో కూడినవిగా మారుతున్నాయని ఇది సూచిస్తోంది. అదే సమయంలో 32.5 శాతం కేసుల్లో ప్రతికూల వ్యాఖ్యలు అపరిచితులు చేసినవి కావు, అత్యంత సన్నిహితులైన స్నేహితులే చేశారు. బాడీ షేమింగ్ కేవలం బాహ్య సామాజిక ప్రవర్తన మాత్రమే కాదు, మన రోజువారీ సంబంధాలు, సంభాషణల్లో కూడా భాగమైపోయిందని ఈ సర్వే వెల్లడిస్తోంది. బరువు, శరీర ఆకృతి, చర్మం రంగు, జుట్టు నాణ్యత వంటి అంశాలపై చేసే వ్యాఖ్యలు ఒక వ్యక్తి ఆత్మవిశ్వాసంపై చాలా లోతైన ప్రభావాన్ని చూపుతాయని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

"బాడీ షేమింగ్ కేవలం ఒక వ్యక్తిగత అనుభవం మాత్రమే కాదు. ఇదొక విస్తృతమైన సామాజిక సమస్య. ప్రజల్లో అవగాహన, సున్నితత్వం, బాధ్యతాయుతమైన ప్రవర్తన చాలా అవసరం" అని లక్నోలోని యూనిటీ పీజీ కాలేజీలో సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శమ్సీ అక్బర్ అన్నారు.

"శరీరం గురించి పదేపదే అవమానకరమైన వ్యాఖ్యలు వినడం వల్ల వ్యక్తి ఆత్మగౌరవం క్రమంగా దెబ్బతింటుంది. వారు తమను తాము ఇతరుల కంటే తక్కువగా భావించడం మొదలుపెడతారు. వారిలో న్యూనతా భావం ఏర్పడుతుంది" అన్నారు.

**చట్టం ఏం చెబుతోంది?**

అపర్ణ రజత్ కౌశిక్ వంటి అధికారిణిపైనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటే, ఆన్‌లైన్ వేదికల్లో సామాన్య మహిళల పరిస్థితేంటో అర్థం చేసుకోవచ్చని అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ న్యాయవాది సాయమా ఖాన్ అన్నారు. "ఒక మహిళ శారీరక ఆకృతిపై అసభ్యకరమైన, అవమానకరమైన లేదా అశ్లీల వ్యాఖ్యలు చేయడం ఆమె గౌరవం, మర్యాదకు సంబంధించిన ప్రాథమిక హక్కును ఉల్లంఘించడమే. బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) లోని సెక్షన్ 79 (మహిళా గౌరవానికి భంగం కలిగించడం), సెక్షన్ 294 (అశ్లీల చర్యలు/పదాలు), సెక్షన్ 356 (మానహాని) కింద ఇది నేరం కిందకు వస్తుంది. దీంతో పాటు, ఐటీ యాక్ట్ 2000లోని సెక్షన్ 66ఈ (గోప్యత ఉల్లంఘన), సెక్షన్ 67 (అశ్లీల కంటెంట్ ప్రచురణ/ప్రసారం) కూడా వర్తించవచ్చు" అని తెలిపారు. "ఇలాంటి ట్రోలింగ్, బాడీ షేమింగ్‌కు వ్యతిరేకంగా కఠినమైన చట్టపరమైన చర్యలు అవసరం. తద్వారా కేవలం ఒక సీనియర్ మహిళా పోలీసు అధికారిణికి మాత్రమే కాకుండా, సమాజంలోని ప్రతి మహిళ గౌరవం, భద్రతకు హామీ ఇవ్వచ్చు" అన్నారు సాయమా ఖాన్.

**దీర్ఘకాలిక ప్రభావం**

బాడీ షేమింగ్ వల్ల వ్యక్తిపై దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశం ఉందని సైకాలజీ నిపుణులు భావిస్తున్నారు. ప్రొఫెసర్ శమ్సీ అక్బర్ మాట్లాడుతూ "బాడీ షేమింగ్‌కు గురయ్యే వారిలో యాంగ్జయిటీ డిజార్డర్, డిప్రెషన్, ఆత్మగౌరవం తగ్గడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. చాలా సందర్భాల్లో ఇది 'బాడీ డిస్మోర్ఫిక్ డిజార్డర్'గా మారి, వారు తమ శరీరం గురించి ప్రతికూల ఆలోచనలను పెంచుకుంటారు. ఫలితంగా పదేపదే అద్దంలో చూసుకుంటూ, ఇతరులతో పోల్చుకుంటూ ఎప్పటికీ అసంతృప్తిగానే ఉంటారు" అని వివరించారు. "ఈ సమస్య మున్ముందు 'ఈటింగ్ డిజార్డర్' వంటి ప్రమాదకరమైన ప్రవర్తనలకు దారితీయవచ్చు. తద్వారా వారు తమ శరీరాన్ని మార్చుకోవడానికి ఆరోగ్యం దెబ్బతినే మార్గాలను అవలంబిస్తారు'' అన్నారు శమ్సీ అక్బర్.

**ఎవరీ అపర్ణ రజత్ కౌశిక్?**

ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌కు చెందిన అపర్ణ రజత్ కౌశిక్, 2015 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి. ఆమెకు నేరస్థుల పట్ల కఠినమైన వైఖరి అవలంబిస్తారనే పేరుంది. ఐపీఎస్ అధికారిణి కావడానికి ముందు ఆమె గురుగ్రామ్‌లోని ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేశారు. ఐపీఎస్ అయిన తర్వాత ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పనిచేశారు అపర్ణ. ఆమె అమేథీలో పోలీస్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. కాస్‌గంజ్, ఔరైయా వంటి జిల్లాల బాధ్యతలను కూడా నిర్వహించారు. లక్నోలో డీసీపీ పదవిలో పనిచేశారు అపర్ణ. ఆమె ఎన్ఐటీ ప్రయాగ్‌రాజ్ నుంచి బీ.టెక్ పూర్తి చేశారు.

# శ్రామిక మహిళ వసతి భూమిలో నిర్మాణం ప్రారంభం




- అక్రమార్కుల చెర నుండి హాస్టల్ భూమికి విముక్తి..?
- స.నెం 647లో శ్రామిక మహిళా హాస్టల్ నిర్మాణం పనులు ప్రారంభం
- హాస్టల్ నిర్మాణం పట్ల స్థానికుల హర్షం
- వేగంగా నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి

**జయభేరి, జవహర్ నగర్ :**

శిశు సంక్షేమం వారి ఆధ్వర్యంలో శ్రామిక మహిళ వసతి గృహం నిర్మాణం పనులను చేపట్టాలని పలుమార్లు జయభేరి పత్రికలో వచ్చిన కథనాల కృషి ఫలించింది.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మల్కాజ్గిరి జోన్ కీసర సర్కిల్ పరిధి జవహర్ నగర్ ప్రాంతంలో గల 647 సర్వేనెంబర్ కు చెందిన ఒక ఎకరా ఇరవై గుంటల స్థలంలో శిశు సంక్షేమం వారి ఆధ్వర్యంలో ఆదివారం శ్రామిక మహిళ వసతి గృహం నిర్మాణం కోసం ముగ్గు పోసి పనులను ప్రారంభించడం జరిగింది.

ఈ మహిళ వసతి గృహం నిర్మాణం పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రభుత్వం మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహిళల అభ్యున్నతి కోసం ప్రతిష్టాత్మకంగా అడుగులు వేస్తోందని అనడానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది, అక్రమార్కుల చెర నుండి విముక్తి పొంది హాస్టల్ కోసం నిర్మాణ పనులు మొదలు కావడంతో జవహర్ నగర్ స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు మరియు పార్టీలకు అతీతంగా రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, విద్యావేత్తలు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ శ్రామిక మహిళా వసతి గృహం ఎందరో మహిళలకు వినియోగ కరంగా ఉపయోగపడుతుందని ప్రభుత్వం జవహర్ నగర్ ప్రాంతంలో ఈ శ్రామిక మహిళా వసతి గృహాన్ని నిర్మించడం ఎంతో ఆనందదాయకమని ఈ మహిళా వసతి గృహ నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తి చేసి మహిళలకు వసతి కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## అక్రమ సమోసా తయారీ కేంద్రంపై దాడి


- ₹5 లక్షల విలువైన అపరిశుభ్ర ఆహార నిల్వలు సీజ్; నిందితుడి అరెస్ట్

**జయభేరి, హైదరాబాద్ :**

సిటీ పోలీస్ టాస్క్ ఫోర్స్‌కు చెందిన HFAST (హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్), కుల్సుంపురా పోలీసుల సమన్వయంతో జియాగూడలోని ఒక అక్రమ ఆహార తయారీ కేంద్రంపై మెరుపు దాడి చేసి, దానిని సీజ్ చేసింది.

విశ్వసనీయ సమాచారం మేరకు, సాయంత్రం టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ నేతృత్వంలోని HFAST బృందం, కుల్సుంపురా స్థానిక పోలీసులు మరియు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ (FSO) కలిసి జియాగూడలోని ఎస్.బి.ఏ (SBA) గార్డెన్ ఎదురుగా ఉన్న ఇంటి నంబర్ 134582/A/B/30 ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సదరు తయారీ కేంద్రం ఎటువంటి FSSAI లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ లేదా ఫైర్ సేఫ్టీ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడు అబ్దుల్ రషీద్ (73 ఏళ్లు) అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో, కుళ్ళిపోయిన గుడ్లు మరియు పదేపదే మరిగించిన నూనెను ఉపయోగిస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా సమోసాలను తయారు చేస్తున్నట్లు తేలింది.

# శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి నిత్యరాబడి రూ.57.56 లక్షలు



**జయభేరి, యాదగిరిగుట్ట, మార్చి22 :**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుండి తరలివచ్చిన భక్తులతో యాదగిరిగుట్ట కిటకిటలాడింది.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కొండపైన, కొండ కింద పలు ప్రాంతాల్లో ఎటు చూసినా భక్తుల రద్దీ కనిపించింది. స్వామి వారి దర్శన క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం, టికెట్ల విక్రయ కేంద్రాలు,పార్కింగ్,బస్టాండ్, పుష్కరిణి,తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు.

అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 5 గంటలకు, సర్వ దర్శనానికి 3 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి,అమ్మవార్లకు రూ.57,56,656 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.3,49,050, బ్రేక్ దర్శనం ద్వారా రూ.6,15,900, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,45,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.10,65,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,37,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.1,42,980, ప్రసాద విక్రయం ద్వారా రూ.19,01,230, కల్యాణకట్ట ద్వారా రూ.1,31,500తోపాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీవైష్ణవ్ కూచిపూడి కళాక్షేత్రం వారిచే కూచిపూడి నృత్య ప్రదర్శన, హైదరాబాద్ కుషాయిగూడకు చెందిన నటరాజ్ డ్యాన్స్ అకాడమీ నృసింహ కళార్చన భక్తులను అలరించింది.

---

# గ్రామస్థాయి కార్యకర్తకు భారత దేశస్థాయిలో గుర్తింపు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్

**జయభేరి, యాదాద్రి భువనగిరి :**



గ్రామస్థాయి కార్యకర్తకు భారత దేశస్థాయిలో గుర్తింపు ఉంటుందని అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అధ్యక్షతన భువనగిరి పట్టణ బైపాస్ రోడ్డు వివేరా హోటల్ లో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొని కాంగ్రెస్ పార్టీ భారత దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్ర చరిత్రలో యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై జిల్లా కార్యవర్గం సభ్యులకు నియామక పత్రాలను అందజేస్తూ నూతన శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువతకు కాంగ్రెస్ కార్యకర్తలకు ఉత్సాహాన్ని నింపడం కోసం, కష్టపడ్డ కార్యకర్తలకు ఎంతటి ఉన్నత స్థాయి పదవి అయినా కాంగ్రెస్ పార్టీలోనే సాధ్యమన్నారు. ప్రస్తుతం అవకాశం వచ్చిన జిల్లా కమిటీ సభ్యులు పార్టీ అభివృద్ధి కోసం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను, భారత దేశంలో బిజెపి చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మతతత్వ వాదులతో రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటాన్ని ప్రజల మధ్యలకు తీసుకువెళ్లి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేంతవరకు పోరాటం చేయాలన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రావడం కోసం మీకు వచ్చిన బాధ్యతలను పనిచేసే సమచితంగా యాదాద్రి భువనగిరి జిల్లా, బ్లాక్ మండల స్థాయి పట్టణ స్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ అభివృద్ధి కోసం హర్నిషాలు కృషి చేయాలని పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అనంతరం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు ఎవరైనా ఒక్కసారి గెలవగానే అదే తన గొప్పతనం అనుకోవద్దని, కార్పొరేషన్ ఛైర్మన్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ అయినా గ్రామ సర్పంచ్ అయినా వార్డు సభ్యులు అయిన ప్రజలతో గెలుపొందిన తర్వాత తిరిగి మరల ఐదేళ్ల తర్వాత గెలవడమే అతని యొక్క పనితనానికి నిదర్శనమన్నారు. ఒక్కసారి గెలవగానే ప్రజలకు స్పందించక పోవడం,ప్రజలు ఫోన్లు చేసిన లేపకపోవడం, ప్రజలు ఇంటి దగ్గరికి వస్తే ప్రతినిధులు లేరని చెప్పడం, కార్యకర్తలు ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు అహంకారంగా వ్యవహరించడ, ఇది పార్టీకి అటు ప్రభుత్వానికి కార్యకర్తలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని,వ్యక్తిగా గెలిచిన ప్రజాప్రతినిధి బాధ్యతగా వ్యవహరించి, ప్రజలతో ఓట్లు పొందామని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి యాదాద్రి భువనగిరిజిల్లా కార్యవర్గ సభ్యులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్, రాష్ట్ర మహిళా అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బండ్రు శోభరాణి, యాదగిరిగుట్ట, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, టిపిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవికుమార్ శ్రీనివాసరావు, పల్లె శ్రీనివాస్,జనగాం ఉపేందర్ రెడ్డి,యాదగిరిగుట్ట, భువనగిరి, ఆలేరు, మోత్కూర్ మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

# భగత్‌సింగ్ పోరాటాల స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితమవ్వాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి

**జయభేరి, యాదగిరిగుట్ట:**



యువత గంజాయి మత్తుకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడిచి తమ భవిష్యత్‌ను కాపాడుకోవాలని, భగత్‌సింగ్ లాంటివారు చేసిన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజాసేవకు అంకితం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భగత్‌సింగ్,రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంలోని న్యాగుండ్లపల్లిలో రెండు రోజులుగా జరుగుతున్న వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసిన అనంతరం యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులను వ్యతిరేకించిన భగత్‌సింగ్ 23 ఏళ్ల వయసులోనే ఉరిశిక్షను చిరునవ్వుతో స్వీకరించి ప్రాణాలర్పించారని కొనియాడారు. అనంతరం సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ స్టాప్ డ్రగ్స్‌స్టార్ట్ స్పోర్ట్స్ అనే ఉద్దేశంతో యువతను క్రీడల పట్ల ఆసక్తి చూపే విధంగా ప్రయత్నం చేయడం అభినందనీయమని, యువత సద్వినియోగం చేసుకొని మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకుండా ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరు రాజయ్య,బండి జంగమ్మ,ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెరబోయిన మహేందర్,పట్టణ కార్యదర్శి,మున్సిపల్ కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్,మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు పెరబోయిన పెంటయ్య, నేతలు కంబాల వెంకటేష్, కంబాల నరసింహ,సాయి తేజ,మహేష్,శేఖర్,అరవింద్, శెట్టి నరసింహ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొదటి బహుమతి మల్లాపురం టీం, రెండో బహుమతి న్యాగుండ్లపల్లి టీంలకు బహుమతులు అందజేశారు.

---



# మూసి తీరంలో అక్రమ సమోసాల దందా

**జయభేరి, హైదరాబాద్, మార్చి 22 :**

హైదరాబాద్‌వాసులు ఇష్టమైన చిరుతిండి సమోసా వెనుక దాగి ఉన్న భయంకరమైన నిజం వెలుగులోకి వచ్చింది. పైన కరకరలాడుతూ, లోపల రుచిగా అనిపించే సమోసాలు వాస్తవానికి కుళ్లిపోయిన పదార్థాలతో తయారవుతున్నాయే షాకింగ్ నిజాన్ని కుల్సుంపురా పోలీసులు బయటపెట్టారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ అపరిశుభ్ర వాతావరణంలో కల్తీ పదార్థాలతో సమోసాలు తయారు చేస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రాములు, ఎస్సై నర్సింహ తన టీంతో కలిసి జియాగూడ బైపాస్ రోడ్డులోని మూసీ తీరంలో ఉన్న ఒక షెడ్డుపై ఆకస్మిక దాడి చేశారు. గోల్కొండకు చెందిన అబ్దుల్ రషీద్ (73)అనే వ్యక్తి ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలంగా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ఫుడ్ సేఫ్టీ నిబంధనలను తుంగలో తొక్కి ఇక్కడ సమోసాలు తయారీ సాగుతోంది. కేవలం లాభార్జనే ధ్యేయంగా పెట్టుకున్న నిర్వాహకుడు ఐదారుగురు కార్మికులతో కలిసి ఈ అక్రమ కేంద్రాన్ని నడుపుతున్నాడు. పోలీసుల తనిఖీల్లో వెలుగు చూసిన దృశ్యాలు అధికారులనే విస్మయానికి గురి చేశాయి. ఈ కేంద్రంలో వినియోగిస్తున్న పదార్థాలన్నీ అత్యంత నాసిరకమైనవి, అనారోగ్యకరమైనవి. సమోసాలు నింపే మిశ్రమం కోసం కుళ్లిపోయిన కోడిగుడ్లను వినియోగిస్తున్నారు. కాలం చెల్లిన, పదే పదే మరిగించిన కల్తీ వంట నూనెలను ఇక్కడ వాడుతున్నారు. సమోసా తయారీలో ఉపయోగించే ఆలుగడ్డలు, ఇతర కూరగాయలు కూడా కుళ్లిపోయినవేనని పోలీసులు ధ్రువీకరించారు. నిల్వ ఉండిపోయిన పురుగు పట్టిన మైదా పిండిని వినియోగిస్తూ ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు. ఈ కేంద్రంలో తయారైన కల్తీ సమోసాలు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కావడం లేదు. జియాగూడ పరిసర ప్రాంతాల్లో అనేక హోటళ్లు, బేకరీలు, వీధి వ్యాపారులకు ఇక్కడి నుంచి పెద్ద మత్తంలో సరకు సరఫరా అవుతోంది. వినియోగదారులు ఆ రుచికి ఆకర్షితులవుతున్నప్పటికీ, లోపల జరుగుతున్న ఈ అక్రమ తంతూ ఎవరికీ తెలియదు. సాధారణంగా ఏదైనా ఆహార పదార్థాల తయారీ కేంద్రం నడపాలంటే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి లైసెన్స్ పొందాలి. కానీ అబ్దుల్ రషీద్ నడుపుతున్న ఈ షెడ్డుకు ఎటువంటి అనుమతులు లేవు. పూర్తి అపరిశుభ్రమైన వాతావరణంలో నేలపైనే పిండిని కలుపుతూ, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా వ్యాపారం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ దాడిలో పోలీసులు పెద్ద మొత్తంలో మైదా, కల్తీ నూనెలు, కుళ్లిన గుడ్లు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు అబ్దుల్ రషీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాలో ఇంకా ఎవరి ప్రమేయం ఉంది, ఎక్కడెక్కడికి సరఫరా చేస్తున్నారు అనే కోంలో దర్యాప్తు చేస్తున్నారు.

---



# రైతు భరోసా యాసంగి పంట 2026 వీడియో కాన్ఫరెన్స్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలంలోని తాటికోల్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన రైతు ఉత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి చే రైతు భరోసా యాసంగి పంట 2026 వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వార్డ్ నెంబర్లు రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




---

# మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో మృతి చెందిన మృతురాలి కుటుంబ సభ్యులను ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) పరామర్శించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆది హనుమంత్ రెడ్డి తల్లి లలితమ్మ శనివారం రాత్రి మృతి చెందారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్ దేవరకద్రకు వచ్చి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పిటిసి సీతా దయాకర్ రెడ్డి కూడా మృతురాలి కుటుంబ సభ్యులు పరామర్శించారు .ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగేందర్ రెడ్డి, కౌన్సిలర్లు బీరప్ప, ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానం చైర్మన్ నరసింహారెడ్డి, హనుమంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజల్ రెడ్డి తోపాటు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

---

# కాంగ్రెస్ నాయకుడికి మాతృవియోగం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బల్సుపల్లి ఆది హనుమంత్ రెడ్డి తల్లి లలితమ్మ శనివారం రాత్రి మృతి చెందారు. టీ తాగుతూ లలితమ్మ అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందారు. అందరితో కలిసిమెలిసి ఉండే లలితమ్మ మృతి చెందిన వార్తను ఆ వాడ ప్రజలు జీర్ణించు కోలేకపోతున్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతురాలి కుటుంబ సభ్యులను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తో పాటు మాజీ ఎమ్మెల్యే, మాజీ జెడ్పిటిసి సీతా దయాకర్ రెడ్డి కూడా మృతురాలి కుటుంబ సభ్యుల పరామర్శించారు. అలాగే బిజెపి పార్టీ మహబూబ్ నగర్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి, బిజెపి పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగేందర్ రెడ్డి, కౌన్సిలర్లు బీరప్ప, యుగేందర్ రెడ్డి లతోపాటు ఆయా మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులు పరామర్శించారు.


---

# వాసవి మాత పారాయణానికి బయలుదేరిన ఆర్యవైశ్యులు




**జయభేరి, దేవరకద్ర :**

హైదరాబాద్ లో ఆదివారం జరిగిన శ్రీ వాసవి మాత పారాయణ కార్యక్రమానికి చలో హైదరాబాద్ పేరుతో స్థానిక ఆర్యవైశ్యులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పారాయణ పూజా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## దుండగులను కఠినంగా శిక్షించాలి

- ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే
- ఆలయ ఈఓ, సీఐ తో ఫోన్ లో మాట్లాడిన బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

**జయభేరి, షాద్ నగర్, మార్చి 22 :**

షాద్ నగర్ నియోజకవర్గము కేశంపేట్ మండలం వేములనర్వ గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామీ దేవాలయంలో గ్రామ సర్పంచ్ భర్త చిన్న నర్సిములు, ఆలయ పూజారి వేణయ్య పంతులు గుప్త నిధుల కోసం కొంత మంది వ్యక్తులతో కలిసి తవ్వకాలు చేపట్టడం దుర్మార్గమైన చర్య అని బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. వేముల నర్వ గ్రామం గ్రామ యువకులు బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డిని కలిసి అక్రమ తవ్వకాలపై చర్చించడం జరిగింది. విష్ణువర్ధన్ రెడ్డి ఆలయ ఈఓతో, కేశంపేట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ తో ఫోన్ లో మాట్లాడి రాజకీయానికి తావు లేకుండా దుండుగులను కఠినంగా శిక్షించాలని అన్నారు. పవిత్రమైన ఆలయంలో ఇలాంటి అక్రమ తవ్వకాలు జరిపి భక్తుల మనోభావాలు దెబ్బతీయ్యొద్దు అని అన్నారు.

## భువనగిరి పార్లమెంట్ సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో క్రీడాకారులకు సన్మానం

- తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మను స్వాగతించిన నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి




**జయభేరి, షాద్ నగర్, మార్చి 22 :**

రాజ్యసభ సభ్యులు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. కె. లక్ష్మణ్ ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంట్ స్థాయిలో నిర్వహించిన ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్‌లో భాగంగా విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం ఘనంగా బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా, కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లా, కేంద్ర మంత్రి బి.ఎల్. వర్మ గారిని ఘనంగా స్వాగతించి, క్రీడాకారులను అభినందించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థాయిలో ఉన్న యువతకు క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తూ, ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. దేశంలో క్రీడా సంస్కృతిని బలోపేతం చేయడంలో ఖేలో ఇండియా ఒక ప్రముఖ వేదికగా నిలుస్తోందని, ఇలాంటి సంసద్ ఖేల్ మహోత్సవాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంసద్ ఖేల్ కోఆర్డినేటర్ గంగిడి మనోహర్ రెడ్డి, అశోక్ గౌడ్, వేముల అశోక్, బూర నరసయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, గూడూర్ నారాయణ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రద్దు యోచనలేదు

- క్లారిటీ ఇచ్చిన విద్యాకమిషన్




**జయభేరి, హైదరాబాద్, మార్చి 21:**

తెలంగాణ విద్యావ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయనే వార్తలు గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ముఖ్యంగా 202627 విద్యా సంవత్సరం నుండి పదో తరగతి బోర్డు పరీక్షలు రద్దు కానున్నాయన్న ప్రచారంపై విద్యాశాఖ కమిషన్ తాజాగా కీలక వివరణ ఇచ్చింది. పదో తరగతి పరీక్షల రద్దుపై వస్తున్న వార్తలను తెలంగాణ విద్యాశాఖ కమిషన్ ఓఎస్డీ డాక్టర్ జీనత్ ఖండించారు. తాము ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పదో తరగతి బోర్డు పరీక్షలను రద్దు చేయాలని ఎక్కడా సిఫార్సు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. ప్రస్తుతం విడివిడిగా ఉన్న ఎస్ఎస్సీ బోర్డును, ఇంటర్మీడియట్ బోర్డును విలీనం చేయాలని ప్రతిపాదించారు. కేవలం 11వ తరగతి పబ్లిక్ పరీక్షలను మాత్రమే రద్దు చేయాలని సూచించినట్లు ఆమె తెలిపారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయవద్దని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందకుండా కచ్చితమైన సమాచారాన్ని మాత్రమే నమ్మాలని ఆమె విజ్ఞప్తి చేశారుమరోవైపు సీఎం రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని నొక్కి చెప్పారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా +2 విధానాన్ని రాష్ట్రంలోనూ బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో విద్యా సంస్కరణలపై ఏర్పాటు చేసిన కమిటీ అధ్యయనం కొనసాగుతోందని, కమిషన్ ఇచ్చేది తుది నివేదిక కాదని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తెలంగాణ విద్యారంగాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం తెలిపారు.మార్చి 20న అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సంక్షేమ, అభివృద్ధి బడ్జెట్‌గా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఇదే క్రమంలో విపక్షాలపై ఆయన ఘాటైన విమర్శలు చేశారు. బడ్జెట్‌ను నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకుని అసెంబ్లీ నుండి బయటకు వచ్చిన బీఆర్ఎస్ నేతల తీరును ఆయన ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్ వ్యవహారశైలిపై, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై సీఎం తనదైన శైలిలో సెటైర్లు వేశారు.ప్రస్తుతానికి పదో తరగతి బోర్డు పరీక్షల రద్దుపై అధికారికంగా ఎటువంటి జీవో వెలువడలేదు. విద్యాశాఖ కమిషన్ సిఫార్సులను ప్రభుత్వం పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోనుంది. విద్యార్థులు తమ విద్యా ప్రణాళికను యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

# బడ్జెట్ లో అన్ని రంగాలకు మేలు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- విద్యా, వైద్యంకు ప్రజాపాలనలో పెద్దపీట
- రైతులకు ఐదు లక్షల బీమా
- ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు మెయిల్ చేసిన బడ్జెట్ 2026-2027



**జయభేరి, షాద్ నగర్, మార్చి 22 :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202 2027 కు సంబంధించిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.... బడ్జెట్ కేటాయింపులు నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని అన్నారు.

**విద్యా, వైద్యానికి ప్రజా ప్రభుత్వంలో పెద్దపీట**

ప్రజాపాలనలో ప్రతి పథకం అర్హులందరికీ చేరుతుందని, నూతన పథకం విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, దివ్యాంగులకు మూడు చక్రాల వాహనం వంటి ఉపయోగకరమైన అంశాలను పథకం రూపంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తామని అన్నారు.

**ప్రతిపక్షాలు చేయని మేలు పనులు ప్రజా ప్రభుత్వం చేస్తుంది...**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చాలా చిత్తశుద్ధితో నాన్నతో ప్రమాణాలతో అన్ని పనులను పూర్తి చేస్తుందని అన్నారు. ప్రతిపక్షం తన హోదాను మర్చిపోయి అనవసరమైన వ్యాఖ్యలు చేస్తుందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి విద్య వైద్యంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారని అన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విద్య, వైద్యం ప్రతి సామాన్యుడికి అందుతుందని అన్నారు.

**గత బిఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రాన్ని దరిద్రంగా మార్చింది**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అనేక అరాచకాలు చేసి ధనికంగా ఉన్న రాష్ట్రాన్ని దరిద్రంగా అప్పులపాలు చేసి ప్రజల సొమ్మును దోచుకున్నారని అన్నారు. సంక్షేమం పక్కన పెట్టి అన్ని సమస్యలు సృష్టించి పేదలని మరింత పేదరికంలోకి నెట్టేసారని అన్నారు. పార్లమెంట్, శాసనసభ, గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికలలో బిఆర్ఎస్ వైఖరి చూసిన ప్రజలు తగిన గుణపాఠం చెప్పి తుక్కుతుక్కుగా ఓడగొట్టారని అన్నారు.ఆర్ఎస్ అంటే బోగస్ రాష్ట్ర సమితి అని తీవ్ర విమర్శలు చేశారు. కుటుంబ పాలన, స్కాములు, గేములు, రాజకీయ హత్యలు, దోపిడీ దొంగతనాలకు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్పడ్డారని అన్నారు. చట్టం తన పని తను చేసుకుంటూ తప్పు చేసిన ఏ ఒక్కరిని కూడా చట్టం వదిలిపెట్టబోదని అన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో అభివృద్ధి సున్నా అప్పులేమో వేల కోట్లు... గత ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసింద ఎమ్మెల్యే శంకర్ ఆరోపించారు. ఇక్కడి సమస్యలు ఒక్కడే వదిలేసి నాయకులు ప్రజల సొమ్ము దోచుకొని దాచుకున్నారని అన్నారు. ప్రజా ప్రభుత్వ ఏటీసీ, , ఐటీ రంగం వంటి అనేక నైపుణ్యమైన కార్యక్రమాలు విద్య ఆరోగ్యంలో ప్రవేశపెట్టి తెలంగాణ అంటే ఒక గొప్ప హబ్ గా మార్చుతున్నామని అన్నారు. రైతు భరోసా, మధ్యాహ్నం భోజన పథకం నేడు ప్రారంభించడం ఎంతో ఆనందకరమని విద్యార్థుల ఆకలి తీర్చడానికి గొప్ప పథకం ప్రవేశపెట్టినందుకుగాను సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యలో మార్పులు చూస్తే ఎంతో ఆనందం. 24% ఉన్న ఫలితాలు 74 నుండి 90 శాతానికి రావడం పొట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు తన వంతు కృషిగా చేసిన చిన్నపాటి ఆహార కార్యక్రమం తమకు ఎంతో ఆనందాన్ని కలుగజేసిందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. మంచి కోసం మార్పు కోసం ప్రజా సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని ప్రతి ఒక్కరికి అన్ని సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాయక్, చల్లా శ్రీకాంత్ రెడ్డి, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గిరిజన నేత రఘునాయక్, బాలరాజు గౌడ్, కేశంపేట మండల పార్టీ అధ్యక్షుడు వీరేశం, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## ఉచిత మెడికల్ క్యాంపు సందర్శించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర

**జయభేరి, భూపాలపల్లి :**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ దగ్గర శ్రీ కాకతీయ కిడ్నీ & మల్టీ స్పెషాలిటి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంప్ శిబిరాన్ని సందర్శించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి.

## డిల్లీ గ్లోబల్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం




**జయభేరి, కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి జీడిమెట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఢిల్లీ గ్లోబల్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధి విచ్చేసి రిబ్బన్ కట్ చేసి స్కూల్ ని ప్రారంభించిన బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి.

## నిరసన చేపట్టిన మధు పార్క్ రిడ్జ్ బాధితులు

- మా ఇండ్లు మాకు కావాలి..

**జయభేరి, బండ్లగూడ :**

ఎక్కడో కూర్చుని సీఎం గాలి మాటలు మాట్లాడొద్దని' బండ్లగూడ జాగిర్ పరిధిలోని మధు పార్కు రెడ్డి అపార్ట్మెంట్ నివాసితులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా మధు పార్కు రిడ్జ్ అపార్ట్మెంట్ ముందు, ప్రధాన రహదారి పక్కన శాంతియుత నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నివాసితులు మాట్లాడుతూ.. తమకు పరిహారం వద్దే వద్దని స్పష్టం చేశారు. తాము రూపాయి రూపాయి కూడా పెట్టుకుని ఇల్లు కట్టుకున్నామన్నారు. తమ ఇళ్లకు సీఎం రేవంత్ రెడ్డి జీరో వ్యాల్యూ ఎలా చేస్తారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# ప్రతీ చెరువునూ నింపి రైతులకు సాగునీరు అందిస్తాం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట :**



ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి చెరువునూ నింపి,రైతులకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.ఎన్నో ఏళ్లుగా నీటి కోసం ఎదురుచూస్తున్న ఆలేరు రైతాంగానికి అండగా ఉండి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతాం అని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మల్లన్న సాగర్ జలాలతో నిండి అలుగు పోస్తున్న చెరువుకు ఆయన ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లాపురం గ్రామస్తులతో కలిసి సంతోషాన్ని పంచుకుంటూ ఆయన మాట్లాడారు. సాగునీటి కల సాకారం గతంలో నీటి ఎద్దడితో ఇబ్బంది పడిన మల్లాపూర్ ప్రాంతం,ఈ రోజు మల్లన్న సాగర్ జలాలతో కళకళలాడుతుండటం శుభసూచకమని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. చెరువులు నిండితేనే భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా పచ్చని పంటలతో గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఆలేరు నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేసి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ సంకల్పమని, రైతు ఆనందంగా ఉండటమే ప్రభుత్వ ధ్యేయమని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, మల్లాపురం గ్రామ సర్పంచ్, మంగ సత్యనారాయణ, వార్డు సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# 159 జ్ఞానమాల గ్రాండ్ సక్సెస్

**జయభేరి, లోతుకుంట :**



జ్ఞానమాల కార్యక్రమం 159వ వారోత్సవం డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జే. డేవిడ్ రాబర్ట్సన్ - అంబేద్కరైట్, అడ్వకేట్ & పబ్లిక్ ప్రాసిక్యూటర్ (మెడ్చల్ & మల్కాజిగిరి), రాజన్ - అంబేద్కరైట్ హాజరై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీ జే. డేవిడ్ రాబర్ట్సన్ మాట్లాడుతూ, బి.ఆర్. అంబేద్కర్ గారి వారసత్వం, ఆశయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు. భారత రాజ్యాంగ పితామహుడిని గౌరవించే వారిని మాత్రమే మనం ఆదరించాలనీ, ఆయనను అవమానించే వారిని ఎందుకు మద్దతు ఇవ్వాలి అనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. అలాగే రాజ్యాంగాన్ని మరియు దేశాన్ని కొన్ని వర్గాల ప్రభావం నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రాబోయే అంబేద్కర్ జయంతి వేడుకలు - ఏప్రిల్ 14, 2026 డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ కార్యవర్గం నిర్ణయం ప్రకారం, ఏప్రిల్ 14, 2026న అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ లొత్కుంట నుండి ప్రారంభమై వెస్ట్ వెంకటాపూర్, భూదేవి నగర్, ఓల్డ్ ఆల్వాల్, సూర్యనగర్, కమాల్లు బోలారం, బోలారం, ఆదర్శ్ నగర్, సదర్ బజార్, రిసాలా బజార్ తదితర ప్రాంతాల్లోని అంబేద్కర్ విగ్రహాలను సందర్శిస్తుంది. ఈ ర్యాలీ ద్వారా స్వాతంత్ర్యం ఎలా సాధించామో, రాజ్యాంగం ప్రాముఖ్యత ఏమిటో ప్రజలకు తెలియజేయడం లక్ష్యం. అలాగే, అంబేద్కర్ విగ్రహం ముందు భారీ కటౌట్లు ఏర్పాటు చేసి అవమానిస్తున్న వారిపై, రాజకీయ పార్టీలు లేదా వ్యక్తుల పట్ల భేదభావం లేకుండా, నాన్‌బైలబుల్ కేసులు నమోదు చేయాలని బోలారం పోలీస్ స్టేషన్ అధికారులను మిషన్ కోరింది. డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్, లొత్కుంట ప్రతినిధులు మాట్లాడుతూ, బాబాసాహెబ్ ఆశయాలను నెరవేర్చడానికి సమిష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 10:00 నుంచి 11:00 గంటల వరకు లొత్కుంట "ఎక్స్" రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి నివాళులు అర్పించాలని అందరినీ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సి.ఎల్. యాదగిరి, రమేష్ కమల (సలహాదారులు), సువర్ణ (సీనియర్ జర్నలిస్టు), కె.ఏ. లక్ష్మి, సి. సురేష్ (డెల్హి), చార్లెస్ రాజ్, కె.ఎం. సురేష్, శివలింగం కమల, కె.జి. రవి, ఎస్. శివశంకర్, మగధర్, కె.ఎన్. లక్ష్మణ్, డా. మురళి, రాజు, వికాస్, వరుణ్ తేజ్, హిమశ్రీ, హిరణ్య, రేవెన్ష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్లామర్ షోతో టాలీవుడ్‌ను షేక్..



టాలీవుడ్‌లో మన దగ్గర తెలుగమ్మాయిలు స్టార్స్ అయిన సందర్భాలు చాలా తక్కువే. నార్త్ నుంచి వచ్చిన భామలకే మనోళ్లు రెడ్ కార్పెట్ పరుస్తుంటారు. ఫరియా కూడా తన కెరీర్ మొదలైనప్పటి నుంచి చిన్న హీరోలతో అవకాశాలు అందుకుంటుంది కానీ.. బ్రేక్ ఇచ్చి కెరీర్ మార్చేసే అవకాశం మాత్రం ఇప్పటి వరకు రాలేదు. అసలు ఫరియా చేసిన సినిమాలు ఎన్ని..? అని లెక్కలేస్తే.. 2021లో 'జాతిరత్నాలు'తో సూపర్ హిట్ కొట్టాక ఆమెకు ఆ రేంజ్ సక్సెస్ రాలేదు. ఆ తర్వాత 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్', 'బంగార్రాజు', 'కల్కి 2898 AD' లాంటి సినిమాల్లో చిన్న చిన్న క్యామియోలు, స్పెషల్ సాంగ్స్ చేసింది. ఇక ఫుల్ లెంగ్త్ హీరోయిన్‌గా 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రైబ్', 'రావణాసుర', 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాలు ఆడలేదు. 'మత్తు వదలరా 2'.. ఆడినా ఆమెకు వర్కవుట్ అవ్వలేదు. మొత్తంగా ఒక 8,9 సినిమాల్లో మాత్రమే నటించింది. అయితే వీటిలో కొన్ని హిట్స్ ఉన్నా కూడా ఆ క్రెడిట్ అంతా హీరోలకే వెళ్లింది కానీ.. హీరోయిన్‌గా ఫరియాను టాప్ లీగ్‌లో కూర్చోబెట్టలేకపోయాయి. అందుకే గ్లామర్ వైపు ఎందుకు టర్న్ తీసుకుంది అనే దానికి క్లియర్ కట్ ఆన్సర్ ఆమె కెరీర్ గ్రాఫ్‌లోనే ఉంది. కేవలం పద్ధతిగా, నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రమే చేస్తే క్యారెక్టర్ రోల్స్ లేదా చిన్న సినిమాలే వస్తాయని ఈ బ్యూటీకి బాగా అర్థమైనట్లుంది. అందుకే తనలో కూడా కమర్షియల్ యాంగిల్ ఉందని మేకర్స్‌కు గట్టిగా హింట్ ఇవ్వడానికే గ్లామర్ డోర్స్ పూర్తిగా ఓపెన్ చేసింది. ప్యాన్ ఇండియా రేంజ్ సినిమాల్లో స్టార్ హీరోల పక్కన మాస్ సాంగ్స్ చేయాలన్నా, బీచ్‌లలో బికినీలు వేయాలన్నా తను రెడీ అన్నట్లుగా సిగ్నల్స్ ఇస్తోంది. మొత్తానికి ఇండస్ట్రీలో నిలబడాలంటే ఆ మాత్రం ఎక్స్‌పోజింగ్ తప్పదన్న ఫార్ములాను ఫరియా గట్టిగానే వంటపట్టించుకుని బరిలోకి దిగింది. అయితే టాలెంట్ ఉండి, గ్లామర్ ఒలకబోసినా.. ఇండస్ట్రీలో క్లిక్ అవ్వాలంటే టైమ్ కూడా కలిసి రావాలి. మరి అందాలు ఆరబోస్తూ ఫరియా చేస్తున్న ఈ గ్లామర్ షో అవకాశాలు తెచ్చి పెడుతుందా..? స్టార్ హీరోల పక్కన కమర్షియల్ హీరోయిన్‌గా సెట్ అవ్వాలన్న ఈ తెలుగమ్మాయి కల నెరవేరుతుందా..? అనేది రాబోయే రోజుల్లో తేలిపోనుంది.



# అన్న బాడీ బాక్సాఫీస్ రా..! ఏడు వారాల్లో పది కేజీలు..

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సినిమా కోసం ఆయన అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. దేవరలాంటి హిట్ తర్వాత ఎన్టీఆర్ నటించిన వార్ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. బాలీవుడ్ దర్శకుడు తెరకెక్కించిన వార్ 2 భారీ అంచనాల మధ్య విడుదలై డిజాస్టర్ అయ్యింది. దాంతో తారక్ ఫనన్ అంతా ఇప్పుడు ఎన్టీఆర్ నెక్స్ట్ సినిమా పై భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ క్రమంలోనే తారక్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో సినిమా అనౌన్స్ చేశారు. కేజీఎఫ్, సలార్ సినిమాలతో భారీ హిట్స్ అందుకున్న ప్రశాంత్ నీల్ ఇప్పుడు తారక్ తో సినిమా చేస్తున్నారని అనౌన్స్ చేసిన దగ్గర నుంచి అభిమానులు పూనకాలతో ఊగిపోతున్నారు. ఈ సినిమా నుంచి ఏదైనా అప్డేట్ రాకపోతుందా అని వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు ఫ్యాన్స్. మహేష్ కాకుండా ఇప్పటి హీరోల్లో అతనంటేనే ఇష్టం.. కృష్ణ చెప్పిన పేరు వింటే పూనకాలే ఇదిలా ఉంటే ఇటీవల తారక్ లుక్స్ గురించి రకరకాల వార్తలు వచ్చాయి. తారక్ సన్నబడటంతో కొందరు అవాక్ అయ్యారు. అయితే ఎన్టీఆర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పాత్రకు తగ్గట్టు మారిపోయి తన నటనతో కట్టిపడేస్తుంటారు తారక్. ఈ క్రమంలోనే ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ సినిమాలో కూడా ఆయన ఓ డిఫరెంట్ లుక్ లో కనిపించనున్నారని తెలుస్తుంది. గుబురు గడ్డంతో రగ్గడ్ లుక్ లో తారక్ కనిపించనున్నారు. అయితే ఈ సినిమా కోసం తారక్ బాడీ బిల్డ్ చేస్తున్నారని తెలుస్తుంది. పర్ఫెక్ట్ లుక్ లో కనిపించడానికి తారక్, ఏడు వారాల్లో పది కిలోల బరువు తగ్గారట. ప్రతిరోజు గంటన్నర పాటు వ్యాయామం, లో ప్రోటీన్ డైట్‌ను ఫాలో అవుతున్నారట తారక్. కాగా డ్రాగన్ సినిమా అనౌన్స్ చేసిన సమయంలో కాస్త బొద్దుగా కనిపించిన ఎన్టీఆర్.. ఇప్పుడు సన్నగా లీన్ లుక్ లోకి మారిపోవడంతో తారక్ ఈ సినిమాలో డ్యూయల్ రోల్ లో కనిపించబోతున్నారా.? అంటూ అభిమానులు గుసగుసలాడుకుంటున్నారు. ఇక ఈ సినిమాలో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ హీరోయిన్ గా నటిస్తుంది. ఈ మూవీ షూటింగ్ సైలెంట్ గా కంప్లీట్ చేస్తున్నాడు దర్శకుడు ప్రశాంత్ నీల్. అయితే త్వరలోనే డ్రాగన్స్ సినిమా నుంచి క్రేజీ అప్డేట్స్ వస్తాయని అభిమానులు ఈగర్ గా ఎదురుచూస్తున్నారు.

# 'పెద్ది'కోసం ప్రత్యేకగీతం



రామ్‌చరణ్ తాజా చిత్రం 'పెద్ది' ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాపై ఇప్పటికే భారీ హైప్ నెలకొని ఉంది. పాటలు, ప్రచార చిత్రాలు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్నాయి. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో బ్యాలెన్స్‌గా ఉన్న షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో చిత్రబృందం బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం పదిరోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఓ ప్రత్యేక గీతంతో పాటు కొన్ని సన్నివేశాలను పూర్తి చేస్తారట. ఈ స్పెషల్ సాంగ్‌లో ఓ అగ్ర కథానాయిక నర్తించనుందని ఫిల్మ్‌నగర్ టాక్. ద్వితీయార్థంలో వచ్చే ఈ పాట కోసం సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ హుషారైన ట్యూన్‌ను సిద్ధం చేశారని, మాస్‌ను ఉర్రూతలూగించే పాట అవుతుందని చెబుతున్నారు. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందుశర్మ, బొమన్ ఇరానీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్. రత్నవేలు, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, రచన దర్శకత్వం: బుచ్చిబాబు సానా.

# నాగార్జునకు నేనంతగా తెలియదు..



గతేడాది కుబేర, కూలీ సినిమాలతో సూపర్ హిట్‌స్‌ను ఖాతాలో వేసుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగార్జున. ప్రస్తుతం అభిమానులు, మూవీ లవర్స్ ఫోకస్ అంతా నాగార్జున కెరీర్‌లో ల్యాండ్ మార్క్ సినిమాగా నిలిచిపోయే 100వ ప్రాజెక్ట్ పైనే ఉంది. ఈ చిత్రాన్ని తమిళ దర్శకుడు రా కార్తీక్‌డైరెక్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అప్‌డేట్ ఎప్పుడెప్పుడొస్తుందా..? అని ఎదురుచూస్తున్న వారిలో రా కార్తీక్ చేసిన కామెంట్స్ జోష్ నింపుతున్నాయి. రా కార్తీక్ ఓ చిట్ చాట్‌లో మాట్లాడుతూ.. 40 ఏండ్లకుపైగా సినీ కెరీర్‌లో నాగార్జున ఎన్నో రికార్డులను బద్దలు కొట్టారు. ఆయన ప్రియదర్శన్, మణిరత్నంతోపాటు పలువురు మలయాళ దర్శకులను తెలుగు సినీ పరిశ్రమకు పరిచయం చేశారు. ఆయన చాలా అంశాలను ప్రేక్షకులను చూపించారు. తమిళ ఫిల్మ్ మేకర్స్‌తో కూడా నాగార్జున విస్తృతంగా పనిచేశారు. కాబట్టి నేను ఎక్కడి (ఏ ఇండస్ట్రీ) నుండి వస్తున్నాననే విషయంలో ఆయనకు ఎటువంటి సమస్య కనిపించలేదని చెప్పుకొచ్చాడు రా కార్తీక్.

సినిమా షూటింగ్ ఇప్పటికే మొదలైంది. అధికారిక ప్రకటన త్వరలోనే ఉండబోతుంది. ఇది నాగార్జున సినిమానే.. కానీ 100వ సినిమా అని ఖచ్చితంగా చెప్పలేను. 'నిథమ్ ఒరు వానం' ఒక నిర్దిష్ట జీవితం గురించి ఉంటే.. ఈ ప్రాజెక్ట్ అంతా మరో జీవితం గురించి సాగుతుంది. జోనర్ విషయాని కొస్తే యాక్షన్, క్రూరత్వంతో కూడిన ఎలిమెంట్స్ ఉంటాయి. నాలో చూడని మరో కోణాన్ని బయటపెట్టానని అనుకుంటున్నా. ఏ స్థాయిలో యాక్షన్ ఉంటుందో.. అందుకు కనెక్ట్ అయ్యే భావోద్వేగాలు కూడా ఉంటాయన్నాడు రా కార్తీక్. అంతేకాదు ఈ ప్రాజెక్ట్ వర్కవుట్ అవ్వడానికి కేవలం నమ్మకమే కారణమని డైరెక్టర్ రా కార్తీక్ అన్నాడు. ఆయన (నాగార్జున)కు నేనంతగా తెలియదు. కానీ నాపై ఆయనకున్న నమ్మకం వల్లే ఇది సాధ్యమైంది. ఒకవేళ నేను ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటే చాలా మంది కొత్త దర్శకులు కూడా స్టార్ యాక్టర్లను సంప్రదిస్తారు.. వాళ్లు కూడా కథలు వింటారు. నేను ఈ విషయాన్ని బ్రేక్ చేయాలనుకోవడం లేదు. ఇది నాగార్జున సార్‌లోని మరో డైమన్షన్‌ను చూపించే పక్కా తెలుగు సినిమా.. అని చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. యూనిక్ స్టోరీ టెల్లింగ్, థ్రిల్లింగ్ కథనాలతో తనదైన మార్క్ చూపించే రా కార్తీక్ నాగార్జున కెరీర్ మైల్‌స్టోన్ సినిమాకు దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ క్రేజీ డైరెక్టర్ ఇంతకీ నాగ్ కోసం ఎలాంటి కథను సిద్ధం చేశాడు. కూలీలో తొలిసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించిన నాగార్జున మరి రా కార్తీక్‌తో ఎలాంటి కథ చేయబోతున్నాడన్నది సస్పెన్స్ నెలకొంది.



# లిరిక్స్ లో బూతులు.. అసభ్యకరమైన సీన్లు..

బాలీవుడ్ నటి నోరా ఫతేహి , నటుడు సంజయ్ దత్ నటించిన కొత్త సాంగ్ సర్కే చునార్ తేరి సర్కే పెద్ద వివాదానికి దారితీసింది. ఈ పాటలోని సాహిత్యం, దృశ్యాలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని తీవ్ర వ్యతిరేకత రావడంతో, దీని హిందీ వెర్షన్ ( సర్కే చునార్ తేరీ ) యూట్యూబ్ తో పాటు ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ నుంచి తొలగించారు. అర్జున్ జన్య స్వరకల్పనలో, మంగ్లి పాడిన ఈ పాట తీవ్ర విమర్శలకు గురైంది. పాటలోని పదాలు మహిళలను చెడుగా చిత్రీకరిస్తున్నాయని చాలామంది ఫిర్యాదు చేశారు. ఈ పాట కొరియోగ్రఫీపై నెటిజన్లు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. నోరా ఫతేహి పదేపదే చీరను పైకి కిందకి దించుతూ, పైకి తీస్తూ ఉండే సన్నివేశాలు అసభ్యకరంగా ఉన్నాయని సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సాంగ్ కాంట్రవర్సీ సోషల్ మీడియాకే పరిమితం కాకుండా న్యాయస్థానానికి కూడా చేరింది. హిందీ వెర్షన్‌ను తొలగించినప్పటికీ, కన్నడతో సహా ఇతర దక్షిణ భారత భాషల్లో ఈ పాట ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయి. మరి వాటిని కూడా తొలగిస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా ఉంది. ఈ సాంగ్ వివాదంపై స్పందించిన గీత రచయిత రకీబ్ ఆలం, 'నేను కన్నడ పాటను హిందీలోకి అనువదించాను.. అంతే కానీ నేను ఎలాంటి తప్పు చేయలేదు' అని వివరణ ఇచ్చారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**